www.kalamdaily.com

# కలం
ప్రజల గళం...

Follow on: Kalamtelugu

శనివారం
07-02-2026

360°
SINGLE PAGE TOPIC
ఫైర్ యాక్సిడెంట్స్

# ప్లాన్ ఒకటి.. కట్టేది మరొకటి



జీహెచ్ఎంసీకి ఇచ్చే బిల్డింగ్ ప్లాన్ ఒకటైతే నిర్మించేది మరొకటి. వాహనాల పార్కింగ్ కోసం వాడాల్సిన సెల్లార్ గోడౌన్‌లుగా మారిపోతున్నాయి. ఫైర్ డిపార్టుమెంటు నుంచి ఎన్ఓసీ (నో అబ్జెక్షన్ సర్టిఫికెట్), జీహెచ్ఎంసీ నుంచి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేకున్నా కరెంట్ కనెక్షన్‌లు, జల మండలి నుంచి నల్లా కనెక్షన్‌లు వచ్చేస్తున్నాయి. అధికారులకు లంచాలు ఇచ్చేస్తే అన్నీ మంజూరవుతున్నాయి. ఇండ్లల్లోనే గోడౌన్‌లు నడుస్తుంటాయి. అందులో ఆయిల్, కెమికల్స్, ఫర్నిచర్, క్లాత్స్.. ఇలాంటివీ ఉంటాయి. ఫైర్ యాక్సిడెంట్ జరిగినప్పుడు వివిధ విభాగాల అధికారులు హడావిడి చేయడం.. ఆ తర్వాత గాలికొదిలేయడం రొటీన్ ప్రాక్టీస్‌గా మారింది. నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు తెలిసినా తనిఖీలుండవ్.. నోటీసులివ్వరు.. సీజ్ చేయడం అసలే ఉండదు.





హైదరాబాద్‌లో వరుస అగ్నిప్రమాదాలు దడపుట్టిస్తున్నాయి. ఎప్పుడు ఎక్కడ ఫైర్ యాక్సిడెంట్ అవుతుందోనని జనం వణికిపోతున్నారు. శీతాకాలంలోనే పరిస్థితి ఇలా ఉంటే.. వచ్చేది ఎండాకాలం.. అప్పుడు ఎలాంటి సిట్యువేషన్ ఫేస్ చేయాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. శాశ్వత పరిష్కారం చూపాల్సిన ప్రభుత్వం నామ్ కే వాస్తే చర్యలకే పరిమితమవుతున్నది. నిండు ప్రాణాలు గాల్లో కలుస్తున్నా.. అధికారులు మాత్రం కాసులకు కక్కుర్తి పడుతున్నారు. బిల్డింగ్ పర్మిషన్ల నుంచి మొదలు ఫైర్ సేఫ్టీ తనిఖీల వరకు అంతా ఇష్టారాజ్యంగా మారిపోయింది. గత నెల 24న శనివారం రోజు నాంపల్లిలోని ఫర్నిచర్ షాపులో అగ్ని ప్రమాదం జరిగి ఐదుగురు సజీవ దహనమయ్యారు. సరిగ్గా రెండు వారాల తర్వాత మళ్లీ ఇప్పుడు శనివారం అదే నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో ఫైర్ యాక్సిడెంట్ జరిగింది. అంతకుముందు గుల్జార్‌హౌస్ ప్రమాదంలో 17 మంది అసువులు బాశారు. ఇందులో ముక్కుపచ్చలారని 8 మంచి చిన్నారులు కూడా ఉన్నారు. ఫైర్ యాక్సిడెంట్లు, అధికారుల కక్కుర్తిపై కలం 360 డిగ్రీస్..

- తెలంగాణ బ్యూరో, కలం

# 10% బిల్డింగ్స్‌కే ఎన్‌వోసీ




జీహెచ్ఎంసీలో ఫైర్ సేఫ్టీ పాటించాల్సిన బిల్డింగ్స్ దాదాపు 5 లక్షల వరకు ఉన్నాయి. ఇందులో ఫైర్ ఎన్‌వోసీ కేవలం 10 నుంచి 15 శాతం వాటికే ఉన్నాయి. మిగతా 85 శాతం భవనాలు ఫైర్ సేఫ్టీనే పట్టించుకోవడం లేదు. చాలా బిల్డింగ్స్‌కు ఎమర్జెన్సీ ఎగ్జిట్ ద్వారాలు లేవు. ఫైర్ ఆర్పే యంత్రాలు కూడా లేవు. హైదరాబాద్‌లో ఏటా సుమారు 15వేల కొత్త, పాత బిల్డింగ్స్‌కు మాత్రమే ఎన్‌వోసీ జారీ, రెన్యువల్ అవుతున్నట్లు లెక్కలు చెప్తున్నాయి. ఫైర్ ఆడిట్ చర్యలు శూన్యం.



# ఆరని మంటలు

## హైదరాబాద్‌లో వరుస అగ్నిప్రమాదాలు.. గాల్లో కలుస్తున్న ప్రాణాలు

### తూతూ మంత్రంగా సర్కారు చర్యలు.. అధికారుల కక్కుర్తి • వచ్చేది ఎండాకాలం.. భయాందోళనల్లో జనం



## ఫైర్ డిపార్ట్‌మెంట్‌లో ఖాళీల రాజ్యం

అగ్ని ప్రమాదం జరిగినప్పుడు వెంటనే స్పందించే కీలకమైన ఫైర్ డిపార్ట్‌మెంట్‌లో ఖాళీలు రాజ్యమేలుతున్నాయి. ఎన్నో ఏండ్లుగా పోస్టులు భర్తీ కావడం లేదు. ముఖ్యమైన ఫైర్ ఫైటర్స్ కొలువులు కూడా పెద్ద ఎత్తున ఖాళీగా ఉన్నాయి. దీంతో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఫైరింజన్ల కోసం బాధితులు ఎదురుచూడాల్సిన దుస్థితి. వచ్చిన ఫైరింజన్లు కూడా మంటలను అదుపు చేయడానికి చాలా సమయం తీసుకుంటున్నాయి.

### 905 ఖాళీలు

**తెలంగాణ ఫైర్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్‌కు మొత్తం శాంక్షన్డ్ పోస్టులు 2801. ఇందులో ప్రస్తుతం ఉన్నది 1,896 మంది.. ఖాళీలు 905. ఈ ఏడాది జనవరి 1న డిపార్ట్‌మెంట్ ఇచ్చిన లెక్క ఇదీ!**

**పలు పోస్టులు ఇలా..**

| కేటగిరీ | శాంక్షన్డ్ పోస్టులు | ఉన్నది | ఖాళీలు |
|---|---|---|---|
| ఫైర్ ఫైటర్ | 1,612 | 902 | 710 |
| లీడింగ్ ఫైర్ ఫైటర్ | 324 | 318 | 06 |
| ఫైర్ ఫైటర్ టెక్నికల్ | 475 | 374 | 101 |
| స్టేషన్ ఫైర్ ఆఫీసర్స్ | 185 | 138 | 47 |

# ఫోరెన్సిక్ ల్యాబ్‌లో రికార్డులు బుగ్గిపాలు

హైదరాబాద్ నాంపల్లిలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో శనివారం ఉదయం (ఫిబ్రవరి 7) భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. మొదటి అంతస్తులో మంటలు చెలరేగడంతో 5 ఫైర్ ఇంజన్లతో అగ్నిమాపక సిబ్బంది అదుపు చేశారు. ఆఫీస్ లోని కంప్యూటర్ ల్యాబ్‌లో తొలుత మంటలు చెలరేగాయి. లోపల చిక్కుకున్న ఇద్దరిని ఫైర్ సిబ్బంది కాపాడారు. వీరిలో ఒకరికి గాయాలు కాగా, హాస్పిటల్‌కు తరలించి ట్రీట్మెంట్ అందిస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు.

**50 కంప్యూటర్లు బుగ్గి..**

సీజ్ ప్రాపర్టీస్ రూమ్ పూర్తిగా కాలిపోయినట్లు డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ శ్రీదాస్ ప్రకటించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించాక ఆయన మీడియాతో మాట్లాడారు. "సాక్ష్యాధారాలను భద్రపరిచిన గది మొత్తం కాలిపోయింది. విచారణలో ఉన్న పలు కేసులకు సంబంధించి సీజ్ చేసిన ప్రాపర్టీ కాలిపోయాయి. ముఖ్యంగా డిజిటల్ సాక్ష్యాల నిధిగా భావించే సుమారు 40 నుంచి 50 కంప్యూటర్లు మంటల్లో కాలిబూడిదయ్యాయి. గదిలో అత్యంత భద్రంగా స్టోర్ చేసి ఉంచిన హార్డ్ డిస్కులు కూడా పూర్తిగా కాలిపోయాయి"అని ఆయన పేర్కొన్నారు.




### ఫోన్ ట్యాపింగ్ ఆధారాలూ కాలిపోయాయా?

**నాంపల్లిలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో డీఎన్ఏ పరీక్షలు, ఫింగర్ ప్రింట్ నిర్ధారణలు చేస్తుంటారు. ఇది స్టేట్ ఫోరెన్సిక్ ల్యాబ్ కావడంతో భద్రపర్చిన రికార్డుల విషయంలో అధికారులు ఆందోళనలో వ్యక్తం చేస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన కీలక ఫైళ్లు ఇక్కడే ఉన్నాయని, వాటిలో కొన్ని కాలిపోయాయని ప్రచారం జరుగుతున్నది.**



# సిగాచిలో మృత్యుఘోష

**ముక్కలైన 46 మంది కార్మికుల దేహాలు**

పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి ఇండస్ట్రీస్‌లో జరిగిన అగ్నిప్రమాదం.. అతిపెద్ద పారిశ్రామిక విషాదం. 2025 జూన్ 30న ఉదయం 9 గంటలకు డ్రయర్ యూనిట్ లో డస్ట్ ఎక్స్ ప్లోజన్ వల్ల ఈ ప్రమాదం సంభవించింది. ఘటనలో 46 మంది చనిపోయారు. ప్రమాదం జరిగినప్పుడు బిల్డింగ్‌లో 140 మందికి పైగా కార్మికులు ఉన్నారు. పేలుడు తీవ్రతకు 5 కిలో మీటర్ల పరిధిలో ఉన్న ఇండ్లు, ఆఫీసుల కిటికీ అద్దాలు పగిలిపోయాయి. 3 అంతస్తుల భవనం క్షణాల్లో పేక మేడలా కుప్పకూలింది. పేలుడు ధాటికి కార్మికుల శరీర భాగాలు 100 మీటర్ల దూరం వరకు ఎగిరిపడ్డాయి.

# 137 ఫైర్ స్టేషన్స్



రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 137 ఫైర్‌స్టేషన్స్ ఉన్నాయి. జిల్లాల వారీగా చూస్తే.. ఆసిఫాబాద్: 2, మంచిర్యాల: 4, పెద్దపల్లి: 3, భూపాలపల్లి: 1, ములుగు: 2, ఆదిలాబాద్: 3, నిర్మల్: 3, నిజామాబాద్: 6, జగిత్యాల: 3, కరీంనగర్: 5, సిరిసిల్ల: 2, సిద్దిపేట: 4, మెదక్: 3, కామారెడ్డి: 4, కొత్తగూడెం: 5, ఖమ్మం: 5, మహబూబాబాద్: 2, వరంగల్: 3, హన్మకొండ: 2, సూర్యాపేట: 3, నల్గొండ:5, భువనగిరి: 5, జనగాం: 3, మేడ్చల్ మల్కాజ్‌గిరి: 6, హైదరాబాద్: 21, రంగారెడ్డి: 9, సంగారెడ్డి: 6, వికారాబాద్: 4, మహబూబ్‌నగర్: 2, నారాయణ్‌పేట: 2, గద్వాల్: 2, వనపర్తి: 3, నాగర్ కర్నూల్: 4 ఫైర్ స్టేషన్లు ఉన్నాయి.

# చిరాగ్‌అలీ లేన్ విషాదం

## ఐదుగురు మృత్యువాత

### మంటలార్పేందుకు పది గంటలు

నాంపల్లి స్టేషన్ రోడ్డు చిరాగ్ అలీ లేన్‌లోని 'బచాస్ ఫర్నిచర్ క్యాసిల్' బిల్డింగ్ ఫోర్త్ ఫ్లోర్ లో ఈ ఏడాది జనవరి 24న శనివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఐదుగురు కాలి బూడిదయ్యారు. వీరిలో 11 ఏండ్లలోపు ఇద్దరు చిన్నారులతోపాటు ముగ్గురు పెద్దలు. ఈ భవనంలో వ్యాపారి సతీష్‌గుప్తా కొన్నేళ్లుగా ఫర్నిచర్ బిజినెస్ చేస్తున్నారు. బిల్డింగ్ సెల్లార్‌లో అక్రమంగా ఫర్నిచర్ మెటీరియల్, ఫోమ్, కెమికల్స్ నిల్వ చేయడం కారణంగా మంటలు వ్యాపించాయి. మంటలను ఆర్పేందుకు దాదాపు 10 గంటల టైమ్ పట్టింది. సెల్లార్లు నీటితో నిండిపోగా, పొగ కమ్మేయడంతో చిక్కుకున్న వారి ఆచూకీని రోబో సాయంతో గుర్తించారు. మొదట నాలుగు ఫైర్ ఇంజన్‌లతో ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్నించారు.

### బస్ భవన్‌లోనూ..

**ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని బస్ భవన్‌లో జనవరి 31 శనివారం సాయంత్రం మంటలు చెలరేగాయి. బస్ భవన్ బి1 సెల్లార్‌లో ప్రమాదం జరిగింది. పనుల్లో నిమగ్నమైన ఉద్యోగులు ఒక్కసారిగా పొగలను చూసి భయంతో బయటకు పరుగులు తీశారు. కొందరు ఉద్యోగులు ఊపిరాడక ఇబ్బంది పడ్డారు. మంటలు వేగంగా వ్యాపించడంతో బస్ భవన్‌లోని వివిధ అంతస్తుల్లోని ఉద్యోగులు అలర్ట్ అయ్యారు. కొద్దిసేపు గందరగోళం నెలకొంది. ఫైర్ సిబ్బంది చేరుకుని ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. పాత ఫైల్స్ ఉన్న సెక్షన్‌లో మంటలు అంటుకుని కొన్ని రికార్డులు కాలిపోయాయి.**



### చేతులు తడిపితే చాలు..!

- విద్యుత్, అగ్నిమాపకశాఖ, జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్ తదితర ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. అనేక రకాల బహుళ అంతస్తుల భవనాలకు తగిన అనుమతులు లేవని గతంలో ఫైర్ డిపార్టుమెంట్ నోటీసులు ఇచ్చింది. రన్ అవుతున్నా అధికారులు చూసీ చూడనట్లుగానే వదిలేస్తున్నారు. చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం ఫైర్ డిపార్టుమెంటుకు లేకపోవడంతో నిస్సహాయంగా ఉండిపోవాల్సి వస్తున్నది. కొన్ని నోటీసులు కోర్టుల్లో కేసులుగా నడుస్తూ ఉన్నాయి.
- నివాస ప్రాంతాల్లో స్క్రాప్ గోదాములు ఉన్నా.. వాటిపై అధికారులు కన్ను పెట్టడం లేదు. చాలా అగ్నిప్రమాదాలు ఇలాంటి గోదాముల్లోనే జరుగుతున్నాయి.
- ఫైర్ సెఫ్టీ మెజర్‌మెంట్స్ ను బిల్డింగ్స్ యజమానులు అమలు చేయడం లేదు. అధికారులు తనిఖీ చేసినప్పుడు చేతులు తడిపి పంపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. 15 మీటర్ల కంటే తక్కువ ఎత్తు ఉన్న భవనాలకు ఫైర్ క్లియరెన్స్ అక్కర్లేదనే నిబంధనను యజమానులు ఆసరాగా చేసుకుంటున్నారు.

### ఎన్నో ఘటనలు

**2022 మార్చి 23:** బోయగూడ స్క్రాప్ గోదాములో జరిగిన ప్రమాదంలో 11 మంది వలస కార్మికులు సజీవ దహనమయ్యారు. సరైన ఎగ్జిట్ లేకపోవడంతో కార్మికులు బయటికి వెళ్లే పరిస్థితి లేక కాలిబూడిదయ్యారు.

**2023 జనవరి 19:** మినిస్టర్ రోడ్ లోని దక్కన్ మాల్ ప్రమాదంలో ముగ్గురు మృతి.

**2023 మార్చి 16:** సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో అగ్నిప్రమాదం వల్ల ఊపిరాడక ఆరుగురు యువతీయువకులు ప్రాణాలు కోల్పోయారు.

**2024 మార్చి 24:** బన్సీలాల్ పేట తుక్కు గోదాములో జరిగిన ఫైర్ యాక్సిడెంట్‌కు ముగ్గురు బలయ్యారు.

# మూడు తరాలు బుగ్గి

**గుల్జార్ హౌస్ ఘటనలో 17 మంది మృతి**

హైదరాబాద్ పాతబస్తీలోని గుల్జార్ హౌస్‌లో 2025 మే 18 తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదం మూడు తరాలను బలితీసుకుంది. 17 మంది చనిపోయారు. ఇందులో ఏడేండ్ల లోపు చిన్నపిల్లలు 8 మంది ఉన్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ముత్యాల దుకాణంలోని ఎలక్ట్రికల్ మీటర్ బాక్స్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు మొదలయ్యాయి. 4 ఏసీ కంప్రెషర్లు ఒక్కసారిగా పేలడంతో దట్టమైన నల్లటి పొగ భవనం మొత్తం కమ్మేసింది. చెక్కతో చేసిన ఇంటీరియర్ ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయి.

- ప్రహ్లాద్ మోదీ తన కుటుంబసభ్యులతో కలిసి కొన్నేళ్లుగా గుల్జార్ హౌస్‌లో నివాసముంటున్నారు. ఈ అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో 21 మంది కుటుంబసభ్యులు ఆ ఇంట్లో ఉన్నారు. అత్తాపూర్‌లో ఓ వేడుకకు హాజరై వచ్చిన వీరంతా ఇంట్లోనే పడుకున్నారు. అదే సమయంలో తెల్లవారుజామున బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోర్‌లో మంటలు చెలరేగాయి. మెయిన్ ఎగ్జిట్‌లోనూ మంటలు చెలరేగడంతో బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది.
- కుటుంబ సభ్యులు మొదట సొంతంగా మంటలు ఆర్పే ప్రయత్నం చేసి, ప్రమాద తీవ్రత పెరిగాక ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు సమాచారం ఇచ్చారని, 45 నిమిషాల ఆలస్యం భారీ ప్రాణనష్టానికి కారణమైందని విచారణలో తేలింది.
- **ఈ ప్రమాదంలో మొదటితరం :** ప్రహ్లాద్ మోదీ (70), ఆయన భార్య మున్ని (70), **రెండో తరం:** వారికుమారులు కోడళ్లు పంకజ్ మోడీ, వర్ష, **మూడో తరం :** మనవళ్లు, మనవరాళ్లు.. ఇలా 21 మంది నిండు ప్రాణాలు గాల్లో కలిశాయి.



